క్లుప్తంగా

కిడ్నీ బాధిత యువకుడికి ఆర్థిక సాయం



బాధిత యువకుడికి ఆర్థికసాయం చేస్తున్న కముజువారిపాలెం గ్రామస్తులు

కొత్తపేట: కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న మట్టపర్తి వెంకటేష్ వైద్యానికి కముజువారిపాలెం గ్రామస్తులు రూ.21 వేలు అందజేశారు. మండలంలోని బిళ్లకుర్రు శివారు మట్టపర్తివారిపాలేనికి చెందిన మట్టపర్తి రాంబాబు కుమారుడు వెంకటేష్‌కు రెండు కిడ్నీలు దెబ్బతిని అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యానికి రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తుంది. నిరుపేద కుటుంబానికి చెందిన బాధిత యువకుని తండ్రి రాంబాబుకు అంత ఆర్థిక స్తోమత లేక అయోమయ పరిస్థితికి లోనవుతున్నాడు. కుటుంబం ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న కముజువారిపాలెం గ్రామ పెద్దలు రూ.21 వేలు సేకరించి వెంకటేష్ వైద్యార్థికి సాయంగా అందజేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తున్న దాత ప్రసాదరాజు

మలికిపురం: లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ వారి ఆధ్వర్యంలో పాలకొల్లు లయన్స్ క్లబ్ వారి ఉచిత కంటి శిబిరం శనివారం నిర్వహించారు. పేదలకు టెస్టులు చేసి అవసరమైన 194 మందికి కళ్లజోళ్లను దాత ముదునూరి ప్రసాదరాజు ఉచితంగా అందించారు. స్థానిక లక్కవరం పంచాయతీ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి చాంబర్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ కోట పుష్పకుమారి పాల్గొని మాట్లాడుతూ నిర్వాహకులను, దాత ప్రసాదరాజును అభినందించారు. పలచోళ్ల రాంబాబు, ముదునూరి హరిరామలింగరాజు, వలవల రాంబాబు, పలచోళ్ల నారాయణరావు, శిరిగినీడి సత్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు ప్రసాదరాజు శాలువ కప్పి, పూలదండతో ఘనంగా సత్కరించారు.

కుష్ఠు వ్యాధి నివారణకు కృషి చేయాలి

ఆలమూరు: కుష్ఠు వ్యాధి నివారణకు వైద్యారోగ్య సిబ్బంది సమష్టిగా కృషి చేసి ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలని జిల్లా పారా మెడికల్ ప్రత్యేక అధికారి (డీపీఎంఓ) పి.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చింతలూరులో శనివారం ఆయన పర్యటించి కుష్ఠు వ్యాధి పక్షోత్సవాల్లో భాగంగా వైద్యారోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే తీరును ఆయన పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీకి చేరుకుని ఇప్పటి వరకూ మండలంలో గుర్తించిన కుష్ఠు వ్యాధిగ్రస్తులను వివరాలను వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయి కిషోర్‌ను అడిగి తెలుసుకున్నారు. యండీటీ ద్వారా మెరుగైన చికిత్సను అందించి వ్యాధిగ్రస్తులు త్వరితగతిన కోలుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, వైద్యారోగ్య సిబ్బంది వి.సువర్చల, ఆర్.నాగేశ్వరరావు, ఎస్ఆర్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50,116 విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈఓ కృష్ణచైతన్య

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గుడివాడకు చెందిన మట్టా రాజావెంకట రామప్రసాద్, మంగా విజయలక్ష్మి దంపతులు రూ.50,116 విరాళంగా సమర్పించారు. శనివారం ఈ మొత్తాన్ని ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్యకు అందజేశారు. అనంతరం దాతకు స్వామివారి చిత్రపటం బహూకరించారు.

పంట కాలువ దుస్థితిపై రైతుల నిరసన



గెద్దాడలో నిరసన తెలియజేస్తున్న రైతులు

మామిడికుదురు: గెద్దాడలోని పంట కాలువలు అధ్వానంగా ఉన్నాయని, పంట కాలువల్లో తూడు, గుర్రపుడెక్క పెరిగిపోవడం వల్ల శివారు ప్రాంతాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదంటూ రైతులు శనివారం నిరసన తెలిపారు. గెద్దాడలోని పంట కాలువ వద్ద నిరసన తెలియజేశారు. పంట కాలువల దుస్థితితో 300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పంట కాలువల పరిస్థితిని ఇరిగేషన్ శాఖాధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా ఫలితం లేదని వాపోయారు. దీనిపై ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మళ్లీ అధికారంలోకి
తీసుకురావడమే లక్ష్యం

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు



పి.గన్నవరంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ విప్పర్తికి స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులై తొలిసారి శనివారం పి.గన్నవరం విచ్చేసిన విప్పర్తికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. స్థానిక మూడు రోడ్ల సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి, అక్విడెక్టు పార్కులో రాజశేఖరరెడ్డి, ఇతర నాయకుల విగ్రహాలకు విప్పర్తి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంలో విప్పర్తి మాట్లాడుతూ తనను ఇన్‌చార్జిగా నియమించిన సీఎం జగన్‌కి రుణపడి ఉంటానన్నారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పార్టీ గెలుపునకు పనిచేయాలని కోరారు. జెడ్పీటీసీలు కశిరెడ్డి అంజిబాబు, బూడిద వరలక్ష్మి, గెడ్డం సంపదరావు, ఎంపీపీ వనజకుమారి, జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు, పార్టీ రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, సొసైటీ చైర్మన్లు యన్నాబత్తుల ఆనంద్, మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, గిడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సీఎం కృషి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సీఎం జగన్ విశేష కృషి చేస్తున్నారని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి విప్పర్తి వేణు గోపాలరావు అన్నారు. స్థానిక సీహెచ్‌సీకి డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. శనివారం ఆయన రూ.5 లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు కొక్కిరి రవికుమార్, పుచ్చకాయల నర్శింహమూర్తి, అడ్డగళ్ల శ్రీను, యువరాజు, దొమ్మేటి సూర్య, జల్లి శ్రీను, చింతా రవి, మంగం శ్రీను, యన్నపు పెద్ద పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ విప్పర్తి పరామర్శ

మామిడికుదురు: పితృవియోగంతో బాధపడుతున్న మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్‌ను జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు శనివారం పరామర్శించారు. దుర్గాప్రసాద్ తండ్రి నెల్లి సింహాద్రి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో సింహాద్రి చిత్రపటం వద్ద జెడ్పీ చైర్మన్ పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌ను పరామర్శించి అతడ్ని ఓదార్చారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పార్టీ నేతలు కుసుమ శ్రీధర్, తోరం సూర్యభాస్కర్, కొనుకు నాగరాజు తదితరులు దుర్గాప్రసాద్‌ను పరామర్శించారు.

ఆరోగ్య భరోసా.. ఆర్థిక భద్రత



చింతలూరులో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు



మామిడికుదురులో ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్న సర్పంచ్ మొహిద్దీన్, ఎంపీటీసీ సీతామహలక్ష్మి

ఆలమూరు: రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలందరికీ ఆరోగ్య భద్రత, ఆర్థిక భరోసా కల్పించడమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, బూత్ కమిటీ మేనేజర్ ఏజీపీ నామాల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చెముడులంక, చొప్పెల్ల, చింతలూరు గ్రామ పంచాయతీల వద్ద శనివారం సర్పంచ్‌లు తమ్మన, దంగేటి చంద్రకళ, మార్గాని కరుణ అధ్యక్షతన జరిగిన సభలో ప్రజాప్రతినిధులు పాల్గొని పింఛన్లు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా సామాజిక పింఛన్లను రూ.మూడు వేలకు పెంచి పేద కుటుంబాలకు పెద్ద కొడుకుగా అండగా ఉంటున్నారన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితర పింఛన్‌దారులకు ఆత్మగౌరవంగా జీవించే హక్కు కల్పించారన్నారు. అలాగే పేద లెవరూ వైద్య చికిత్స కోసం అప్పులు బారిన పడి ఆర్థికంగా చితికిపోకూడదని ఉద్దేశంతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం క్రింద రూ.25 లక్షల వరకు పరిమితిని పెంచి ప్రజలందరికీ ఆరోగ్య భరోసా కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అంతేకాకుండా ప్రతి ఊరికి ఒక హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించి ప్రజల ఆరోగ్య విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారని కొనియాడారు. వైస్ ఎంపీపీ నేలపూడి రత్నకుమారి, ఉప సర్పంచ్‌లు తోరాటి దుర్గారావు, మోరంపూడి వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు పేదలకు వరం

మామిడికుదురు: ఆరోగ్యశ్రీ ద్వారా అందించే వైద్య సేవల పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం పేదలకు వరం లాంటిదని సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ఎంపీటీసీ నయినాల సీతామహలక్ష్మి పేర్కొన్నారు. మామిడికుదురు పంచాయతీ వద్ద శనివారం లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. సభలో మాట్లాడుతూ ఎంతో మంది పేదలకు ఆరోగ్యశ్రీ అండగా నిలుస్తోందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ఆరోగ్యశ్రీ వరప్రసాదంగా మారిందన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాస్, ఏఎన్ఎంలు జయకుమారి, దుర్గాదేవి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందిస్తాం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- పేరవరంలో గడప గడపకు మనప్రభుత్వం



పేరవరంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: అర్హత ఉన్న ప్రతి ఆడపడుచుకీ ఇంటి స్థలం అందిస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని పేరవరంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాయి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు దాసరి రామాంజనేయులు, సర్పంచ్ విజయభారతి, పార్టీ నాయకులు వంక దుర్గారావు, సుబ్బారావు తదితరుల ఆధ్వర్యంలో 210 మంది లబ్ధిదారులకు ఇంటికి పెద్ద కొడుకు అనే మాటను సార్థకం చేస్తూ ఆడపడుచులకు పసుపు, కుంకుమ, రవికలతో పుట్టింటి కానుకలా ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సొంత ఇల్లు లేని వారు ఎవరూ ఉండకూడదనే దృఢ సంకల్పంతో 30 లక్షలకు పైగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు అందజేశారని, కొత్తపేట నియోజకవర్గంలో సుమారు 17 వేల మందికిపైనే లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించామన్నారు. అలాగే రూ.61.80 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనం, ఆర్బీకేలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ క్యాలెండర్ ముందుగానే ప్రకటించి, క్యాలెండర్ ప్రకారం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా లెక్క చేయకుండా సంక్షేమ పథకాల లబ్ధిని బటన్ నొక్కి లబ్ధిదారుల అకౌంట్స్‌లో నగదు వేస్తున్న జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని సమయం వచ్చినప్పుడు ప్రజలు కూడా గుర్తుపెట్టుకుని బటన్ నొక్కి వారి అభిమానాన్ని చూపించాలన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిత్యం ఆలోచించే ప్రభుత్వాన్ని ఆదరిస్తే రాబోయే ఐదేళ్లలో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారన్నారు. ఆడుదాం-ఆంధ్రా పోటీల్లో పేరవరం సచివాలయం నుంచి ఎంపికైన క్రీడాకారులకు టీషర్టులు, టోపీలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాస రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు కొల్లి శ్యాంసన్, గారపాటి గంగారామ్‌చౌదరి, సర్పంచ్ పాలా నాగేశ్వరరావు, ఎంపీడీఓ నాతి బుజ్జి, తహసీల్దార్ అనిల్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపుతో పెరిగిన భద్రత



మలికిపురంలో పింఛన్లను అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: సీఎం జగన్ పెంచిన పింఛన్ నగదు కారణంగా వృద్ధులకు సామాజిక భద్రత పెరిగిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద ఇటీవల ప్రభుత్వం పెంచిన రూ.3 వేల పింఛన్ నగదును ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించి ప్రారంభించారు. సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల జీవన ప్రమాణాలను పెంచిన ఘనత సీఎం జగన్‌దేనని అన్నారు. ఏ రాష్ట్రమైన ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరచాలని, గత ప్రభుత్వాలు దానిని గాలికి వదిలేస్తే సీఎం జగన్ శ్రద్ధ వహించి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారని అన్నారు. ఇందుకోసం ఎన్ని ఇబ్బందులైనా ఎదుర్కొని నిధుల సమీకరిస్తున్నారని అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీరబ్రహ్మాజీరావు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడు, తహసీల్దార్ నరసింహారావు, చింతా రాజబాబు, చిట్టాల శ్రీను పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం పాలన

సఖినేటిపల్లి: రాష్ట్రంలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ పింఛన్ కానుక కార్యక్రమంలో రూ.3 వేల పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీలు రాపాక దీవెనకుమారి, రుద్రరాజు చినరాజా, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, రాజోలు ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, ఎంపీడీవో బడుగు మంగాదేవి, ఎంపీటీసీ మందపాటి రత్నం, నాయకులు పాల్గొన్నారు.

కాటన్ బ్యారేజీ రోడ్డుకు మోక్షం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంక వద్ద కాటన్ బ్యారేజీపై రోడ్డు ఛిద్రమై వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. బ్రిడ్జి భాగం కాకుండా మిగిలిన భాగం రోడ్డు నిర్మించారు. కొన్ని సాంకేతిక ఇబ్బందుల దృష్ట్యా బ్రిడ్జిపై రోడ్డు నిర్మించడం వీలు కాలేదు. దానిని కూడా అధిగమించి కలెక్టర్‌తో రూ.20 లక్షలు మంజూరు చేయించి శనివారం రోడ్డు పనులను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. బొబ్బర్లంక బ్యారేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి



రావులపాలెంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ కె.శ్రీనివాసరావు

పి.గన్నవరం: ఉమ్మడి జిల్లాలో 55 వేల మంది పదో తరగతి విద్యార్థులకు 'జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్' పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్టు జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు వెల్లడించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పుస్తకాల పంపిణీని శనివారం ఆయన ప్రారంభించారు. హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విప్పర్తి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని మంచి ఉత్తీర్ణతా శాతం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఎంపీడీఓ ఎం.భారతి, పార్టీ సీనియర్ నాయకుడు జక్కంపూడి తాతాజీ, సర్పంచ్ బొండాడ నాగమణి, ఎస్ఎంసీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, కొక్కిరి రవికుమార్, పుచ్చకాయల నరసింహమూర్తి, రాజు, అడ్డగళ్ల శ్రీను, దొమ్మేటి సూర్య, నూకపెయ్యి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు అన్నారు శనివారం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ నుంచి అందజేసిన పదో తరగతి స్టడీ మెటీరియల్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాలలో 203 మందికి బుక్స్ అందజేసినట్లు హెచ్ఎం ఎం.సుబ్బరాజు తెలిపారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో 550 పైగా మంచి మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి రూ.5 వేల చొప్పున అందిస్తున్నట్లు ఎస్ఎంసీ చైర్మన్ చిర్ల కనికిరెడ్డి ప్రకటించారు. అదే విధంగా మండల స్థాయిలో ఫస్ట్, సెకండ్ సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున బహుమతులు అందించనున్నట్టు జెడ్పీటీసీ శ్రీనివాసరావు, జక్కంపూడి లక్ష్మీనారాయణలు ఇద్దరూ బహుమతులు ప్రకటించారు. ఉపాధ్యాయులు సువర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సురక్ష ద్వారా అత్యుత్తమ సేవలు



నర్శిపూడిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

ఆలమూరు: పేద ప్రజల ఆరోగ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండో విడత చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష (2.0) పథకం ద్వారా నాణ్యమైన అత్యుత్తమ సేవలను అందిస్తూ రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా సీఎం జగన్ తీర్చిదిద్దుతున్నారని కొత్తపేట అడిషనల్ డీఎంహెచ్ఓ ఎం.సుమలత అన్నారు. మండలంలోని నర్శిపూడిలో చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సువర్చలాదేవి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక వైద్య నిపుణులు మేఘ స్పందన, దుర్గాప్రసాద్, మల్లికార్జున పాల్గొని 186 మందికి మెరుగైన వైద్య సేవలు అందించి 106 రకాల మందులను ఉచితంగా అందజేశారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న పలువురిని గుర్తించి ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్ పర్యవేక్షణలో ఎంఎల్‌హెచ్‌పీలు సీజనల్ వ్యాధులు-లక్షణాలను వివరించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, సర్పంచ్ కండిబొట్ల శ్రీనివాసు, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బారావు, చల్లా పద్మ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా అప్పనపల్లి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయంలో శనివారం రద్దీ నెలకొంది. స్వామివారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన బాలబాలాజీ స్వామిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. భక్తుల రాకతో నవీన ఆలయంతో పాటు పాత గుడి కోలాహలంగా మారింది. వివిధ సేవల ద్వారా ఆలయానికి రూ.2.26 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.25 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు. 3,085 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 2,269 మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు.

వేంకటేశ్వరుని ఆలయంలో పూజలు



నల్లచెరువులో వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న మహిళలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగా, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభహారతి ఇచ్చారు. వేద పండితుల స్వామి తులసి పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రభల తీర్థం నిర్వహణపై ఆర్డీఓ సమీక్ష



జగ్గన్నతోట ప్రభల తీర్థం జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ ముక్కంటి

అంబాజీపేట: సంక్రాంతి సందర్భంగా అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో ఈ నెల 16న నిర్వహించే ప్రభల తీర్థం నిర్వహణపై కొత్తపేట ఆర్డీఓ ముక్కంటి శనివారం సమీక్షించారు. గంగలకుర్రు పంచాయతీలో డీటీ ఎస్.నాగపద్మాలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏకాదశ రుద్రులు ఉత్సవ కమిటీల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో చర్చించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆర్డీఓ సూచించారు.

ప్రభల తీర్థం జరిగే ప్రాంతంలో మొబైల్ టాయిలెట్స్, తాగునీరు, ట్రాఫిక్ ఆంక్షలు తదితర అంశాలపై చర్చించారు. పారిశుధ్య ఏర్పాట్లకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని ఎంపీడీఓ కె.సత్యనారాయణమూర్తికి ఆర్డీఓ సూచించారు. సమావేశంలో డీఎల్‌పీఓ ఎం.ప్రభాకర్, ఏపీడీ డి.రాంబాబు, డివిజనల్ వైద్యాధికారి సుమలత పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధ్యానంతో మంచి ఆలోచనలు

రావులపాలెం: ధ్యానం చేయడం వలన మనిషిలోని నెగిటివ్ ఆలోచనలు రావని, మూఢనమ్మకాలు తొలగి భయం తొలగిపోవడంతో పాటు, ధైర్యం, ఓర్పు, సహనం, సరైన ఆలోచనలు, ధ్యానంతో అలవాటు పడతాయని, మంచి జీవన విధానం, సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, మోక్షం మొదలగు మంచి లక్షణాలు ధ్యానం వలన వస్తాయని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ జిల్లా కన్వీనర్ ఎస్.అనిత విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రావులపాలెంలో మెడిటేషన్ (ధ్యానం)పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనిత, సొసైటీ సభ్యులు సీహెచ్ నాగలక్ష్మి, పి.ఉషారాణి, వర్మ, నాగలక్ష్మి హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం బృందావన్ ప్రేమికుల సహకారంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. మొక్కలను ప్రతి ఒక్కరూ వారి ఇంటి దగ్గర నాటి, వాటిని పోషించి పర్యావరణాన్ని రక్షించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మానవునికి సహజవాయువు, ఆక్సిజన్ అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.సత్యమూర్తి, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్, రమేష్‌బాబు, హేమలత, బీపీఎన్ రెడ్డి హరిబాబు, పూజ శ్రీనివాస్, సుభాషిణి, శైలజ, సిద్ధార్థ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి హోమం

ఆలమూరు: మండలంలోని పినపళ్లలో శనివారం వైభవంగా గణపతి హోమం జరిగింది. స్థానిక వెంకటసాయి రైస్ మిల్లు ఆవరణలో వేద పండితులు కుమారస్వామి, లక్ష్మణస్వామి మంత్రోచ్చారణల మధ్య వట్టికూటి సతీష్ దంపతులు భక్తిశ్రద్ధలతో ఈ గణపతి హోమం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ఈ కార్యక్రమాన్ని తిలకించారు. కృష్ణ తేజ సంస్థల అధినేత వంక సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి డాక్టర్ చల్లా ప్రభాకరరావు, సర్పంచ్ సంగిత సుభాష్, వంటిపల్లి విశ్వనాథం పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట: గంగలకుర్రు గ్రామదేవత రావులమ్మ అమ్మవారి ఆలయ 21వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. అమ్మవార్ని పురవీధుల్లో ఊరేగించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్స వం సందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఆలయం వద్ద అన్న సమారాధన జరిగింది. శ్రీరామనామ సర్వనామ కీర్తనలతో భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వంగా రంగారావు, జయను చిట్టిబాబు, అరిగెల మధు, యర్రంశెట్టి సురేష్ పాల్గొన్నారు.

గేదాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పి.గన్నవరం: మండలంలోని బెల్లంపూడిలో పునర్నిర్మించిన ఆలయంలో గేదాలమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. దాతల సాయంతో నిర్మించిన ఆలయంలో అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఈనెల 4న ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు ప్రత్యేక పూజలు జరిగాయి. శనివారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం, కుంకుమార్చనలు తదితర పూజలు జరిగాయి. గ్రామస్తులతో పాటు, వివిధ గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన చేశారు.

19న ధనమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మామిడికుదురు: లూటుకుర్రులోని ధనమ్మపేటలో పునర్నిర్మించిన ఆలయంలో ధనమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఈ నెల 19న జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను శనివారం ఆవిష్కరించారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు మొదటి పత్రికను గోకవరపు ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై అవగాహన

రాజోలు: మహిళల రక్షణ చట్టాలపై పొన్నమండ గ్రామ పంచాయతీ వద్ద మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలరాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.హిమబిందులు భ్రూణ హత్యలు, బాలలపై దాడులు, మహిళా, శిశు సంక్షేమం వంటి అంశాలకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. లోక్ అదాలత్ సభ్యుడు ఎల్‌వీ ప్రసాద్, న్యాయవాది పీఈ మైఖేల్, సర్పంచ్ కుక్కల బేబికుమారి తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో వికసిత్ భారత్

అయినవిల్లి: వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా శనివారం విలస, సిరిపల్లి, నేదునూరు గ్రామాల్లో సర్పంచులు కుసుమ లిల్లీమంగేష్కర్, కుడుపూడి శాంతావతి, గుమ్మడి ప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అయ్యాజీ వేమా, బీజేపీ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న వివిధ పథకాలకు సంబంధించిన నిధులు వాటి ఉపయోగం గురించి వివరించారు. ఎంపీటీసీ ఇందుగుల వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వికసిత్ భారత్ యాత్ర

సఖినేటిపల్లి: మండలంలో వివిధ గ్రామాల్లో ఆదివారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకూ జరిగే వికసిత్ భారత్ యాత్ర షెడ్యూల్‌ను శనివారం ఎంపీడీవో బడుగు మంగాదేవి విడుదల చేశారు. గ్రామాల వారీగా ఈ నెల 7న సఖినేటిపల్లి, టేకిశెట్టిపాలెం, 8న అంతర్వేది దేవస్థానం, కేశవదాసుపాలెం, 9న అంతర్వేదికర, అప్పనరామునిలంక, 10న గుడిమూల, మోరి, 11న గొంది, మోరిపోడు, 12న పల్లిపాలెం, రామేశ్వరం, 13న సఖినేటిపల్లిలంక, అంతర్వేదిపాలెం, 14న వీవీమెరక, శృంగవరప్పాడుల్లో క్యాంపులు నిర్వహిస్తామన్నారు.